

ఆమదాలవలస: జొన్నవలస వద్ద నేలవాలిన వరి



లక్ష్మీనర్సుపేట సమీపంలో వర్షపు నీటిలో మొక్కజొన్న కంకులు

అకాల వర్షం.. తీరని నష్టం

- ఈదురుగాలులకు నేలరాలిన మామిడి, జీడి
- దెబ్బతిన్న వరి, మొక్కజొన్న
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

శ్రీకాకుళం-ఆంధ్రజ్యోతి, శ్రీకాకుళం అర్బన్/ నరసన్నపేట/ ఎల్.ఎన్.పేట/సరుబుజ్జిలి/ ఆమదాలవలస, మార్చి 20: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడ్డాయి. దీంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లడంతో రైతులు లబోదిబోమంటున్నారు. నరసన్న పేట మండలంలోని జమ్ము, శివరాంపురం, పొన్నానపేట, పోతయ్యవలస, మడపాం, బుచ్చిపేట, ఉప్పరిపేట, లుకలాం, కామేశ్వరిపేట, కొబగాం, వెంకటాపురం తదితర గ్రామాల్లో జీడి, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. మామిడి, జీడి పిందె దశలో రాలిపోవడంతో దిగుబడి తగ్గుతుందని రైతులు గగ్గోలు చెందుతున్నారు. ఎల్.ఎన్.పేట మండలంలోని బసవరాజుపేట, పెద్దకోట, లక్ష్మీనర్సుపేట, మిరియాపల్లి, వాడ వలస, దబ్బపాడు, ధనుకువాడ, తదితర గ్రామాల్లో మొక్కజొన్నపంటకు తీరని నష్టం జరిగింది. ఈదురు గాలులకుతోడు భారీ వర్షం కురవడంతో పొలాల్లోనే పంట నేలకొరిగింది. మొక్కజొన్న కంకులు నీటిలో తేలియాడు తున్నాయి. ఎకరాకు సుమారు రూ.30వేల నుంచి రూ.40వేల పెట్టుబడి పెట్టామని, పంట చేతికందిన సమయంలో అకాల వర్షం తమను నట్టేట ముంచిందని రైతులు వాపోతున్నారు. ఆమదాలవలస మండలంలోని జొన్నవలస, మునగవలస, దన్నానపేట తదితర గ్రామాల్లో వరి చేలు నేల వాలాయి. వేల రూపాయలు పెట్టుబడి పెట్టామని, వర్షాలు వల్ల పంట నాశనమైంద ని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. జలుమూరు మండలం శ్రీముఖలింగం, నగిరికటకం, అచ్యుతాపురం, మర్రివలస, శ్రీమన్నారాయణపురం తదితర గ్రామాల్లో మొక్కజొన్న పంట తడిసి ముద్దయింది. హిరమండలం మండ లంలో నువ్వు, మినుము,పెసర, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. గ్రామాలవారిగా దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్నామని వ్యవసాయ అధికారి సంధ్య తెలిపారు. 30 నుంచి 40 ఎకరాల్లో నువ్వు పంటకు నష్టం వాటిల్లిందని అంచనా వేసినట్లు చెప్పారు. పాతపట్నంలో కురిసిన వర్షం కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

పిడుగు పాటుకు గృహోపకరణాలు దగ్ధం

నరసన్నపేట మండలం తామరాపల్లిలో బుధవారం విద్యుత్ తీగలపై పిడుగుపడింది. దీంతో కల్లాల్లో ఉన్న పట్ట తుంబయ్యకు చెందిన గడివాము దగ్ధమైంది. అలాగే, గ్రామానికి చెందిన బి.గణేష్‌కు చెందిన టీవీ, ఏసీ, విద్యుత్ ఉపకరణాలు దగ్ధమయ్యాయి. మరో 30 మందికి చెందిన ఫ్యాన్లు, లైట్లు కాలిపోయాయి. లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది. ఎల్.ఎన్.పేట మండలం తురకపేట గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది.



హిరమండలం: నీట మునిగిన పెసర పంట

చిత్తడిగా ఏబీ రోడ్డు..

సరుబుజ్జిలి మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆలికాం-బత్తిలి రహదారి చిత్తడిగా మారింది. రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు చేరడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నాలుగు కిలోమీటర్ల రహదారి పనులకు గతేడాది నవంబర్‌లో స్పీక ర్ తమ్మినేని సీతారాం సరుబుజ్జిలి జంక్షన్ వద్ద శంకుస్థాపన చేశారు. రూ.2.75కోట్ల నిధులు మంజూరైనా పనులు మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా పనులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి..

జిల్లాలోని కవిటి మండలంలో 11 మిల్లీ మీటర్లు, పలాసలో 9.25, హిరమండలంలో 9 మి.మీ వర్షపాతం నమోదైనట్లు విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ సునంద తెలిపారు. ఈ పరిస్థితుల్లో పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు, పశు-గొర్రెల కాపరులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెట్లు, సెల్ టవర్లు, స్తంభాల కింద ఉండరాదన్నారు. పొలాలు, మైదానాలు ఇతర బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా సురక్షితమైన ప్రదేశాలను ఆశ్రయించాలని సూచించారు.



పాతపట్నంలో కురుస్తున్న వర్షం



సరుబుజ్జిలి వద్ద ఏబీ రోడ్డు దుస్థితి



జలుమూరు: శ్రీముఖలింగంలో మొక్కజొన్న పంటపై కప్పిన టార్పాలిన్లు



- సోంపేట మండలం రాణిగాంలో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల ధార కేంద్రం ఇది. ప్రజలకు శుద్ధ జలం సరఫరా చేయాల్సిన ఈ కేంద్రం గత కొన్నేళ్లుగా పనిచేయడం లేదు. మోటార్ కాలిపోవడంతో నీరు సరఫరా కావడం లేదు. బాగు చేసేందుకు అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. దీంతో ఈ గ్రామస్థులు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బాలిగాం వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. దీనివల్ల వ్యయప్రయాసలకు గురవుతున్నారు.
- సోంపేట మండలం చిన్న మామిడిపల్లిలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజలధార కేంద్రం ఇది. మోటార్ మరమ్మతులకు గురై ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో చిన మామిడిపల్లితో పాటు చిన్నలోహరిబంద, ధర్మపురం, సిరమామిడి తదితర గ్రామస్థులు తాగునీటికి పడుతున్న బాధలు వర్ణణాతీతం.

మూతపడుతున్నాయ్!

- ఎన్టీఆర్ 'సుజల ధార'పై ప్రభుత్వ నిర్లక్ష్యం
- నిర్వహణను గాలికొదిలేసిన వైనం
- ఎక్కడికక్కడే పని చేయని ప్లాంట్లు
- ఉద్దానం ప్రజలకు తప్పని తాగునీటి కష్టాలు

(కాశీబుగ్గ)

పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో పదుల సంఖ్యలో శుద్ధ జలాల సరఫరా కేంద్రాలు మూతపడ్డాయి. కానీ, వాటిని బాగుచేసే ప్రయత్నం జరగడం లేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉద్దానంలో కిడ్నీ వ్యాధులకు తాగునీరు కలుషితం కావడం ఒక కారణమని అధ్యయనాలు తేల్చాయి. దీంతో ప్రజలకు సురక్షితమైన నీటిని సరఫరా చేసేందుకు 2018లో టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ సుజలధార పథకానికి శ్రీకారం చుట్టింది. రూ.14 కోట్ల వ్యయంతో పలాస, వజ్రపుకొత్తూరు, మందస, కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురంలో మండలానికి ఒకటి చొప్పున మదర్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. ఏడు మండల్లాలోని 135 గ్రామాల్లో సరఫరా కేంద్రాలను నెలకొల్పింది. మదర్ ప్లాంట్ల నుంచి సరఫరా కేంద్రాలకు శుద్ధ జలాలను తరలించేందుకు స్టీల్ కంటైనర్లతో కూడిన ట్రాక్టర్ ట్యాంకర్లను కూడా సమకూర్చింది. 20 లీటర్ల నీటిని రూ.2కే అందించే ఏర్పాట్లు చేసింది. కొన్నాళ్ల పాటు ఇవి బాగానే పనిచేశాయి. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వహణను గాలికొదిలేసింది. ఇటీవల ఉద్దానం సమగ్ర మంచినీటి పథకం అంటూ హడావుడి చేసిన ప్రభుత్వం వీటిని పూర్తిగా పట్టించుకోవడం మానేసింది. దీంతో ఇవి ఒక్కొక్కటీగా మూతపడుతున్నాయి. దాదాపు 2 నియోజకవర్గాల్లో సగానికిపైగా మూతపడ్డాయి. ట్యాంకర్లు సైతం తరచూ మొరాయిస్తున్నాయి. దీంతో శుద్ధ జలాల తరలింపులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వేసవి కావడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల ప్రజలు బోర్లు, బావుల నీటిని తాగి అస్వస్థతకు గురవుతున్నారు.

కొలిక్కిరాని సమగ్ర నీటి పథకం పనులు..

కంచిలి మండలంలో చేపడుతున్న ఉద్దానం సమగ్ర మంచినీటి పథకం పనులు ఇంకా కొలిక్కి రాలేదు. చాలా గ్రామాలకు ఇంతవరకు పైపులైన్లు వేయలేదు. అయితే, ఎన్నికలు సమీపించడంతో గత ఏడాది డిసెంబరులో సీఎం జగన్ ఈ పథకాన్ని హడావుడిగా ప్రారంభించారు. దీంతో ఎన్టీఆర్ సుజలధార పథకాన్ని పూర్తిగా గాలికొదిలేశారు. కానీ ఉద్దానం సమగ్ర మంచినీటి పథకం అందుబాటులోకి వచ్చేసరికి దాదాపు ఏడాది పడుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో 20 లీటర్ల క్యాన్ ధర రూ.2లు ఉండగా.. నిర్వహణ వ్యయం పేరిట వైసీపీ సర్కారు దానిని రూ.7కు పెంచింది. మూడున్నర రెట్లు పెంచి పేదవర్గాలపై భారం మోపింది. అప్పట్లో ఎన్టీఆర్ సుజలధార పథకం కుప్పం నియోజకవర్గానికి కేటాయించాల్సి ఉంది. కానీ నాడు మంత్రిగా ఉన్న లోకేష్ ప్రత్యేక చొరవతో ఉద్దానంలో ఈ ట్యాంకులను ఏర్పాటు చేశారు. కానీ, నడిపించడంలో మాత్రం వైసీపీ సర్కారు పూర్తిగా విఫలమైంది. ఇది ఉద్దానం ప్రజలకు శాపంగా మారింది.

నీరు అందడం లేదు..



ఉద్దానంలోని ఎన్టీఆర్ సుజలధార ప్లాంట్ల ద్వారా తాగు నీరు అందడం లేదు. వీటి నిర్వహణను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది. ప్రజలకు 20 లీటర్ల శుద్ధ జలాలను టీడీపీ ప్రభుత్వం రూ.2కే అందించేది. కానీ వైసీపీ ప్రభుత్వం రూ.7కు పెంచడం దారుణం.

-చౌదరి మురళీకృష్ణ, అంబుగాం

బాగుచేయిస్తున్నాం..

శుద్ధ జలాల ప్లాంట్లు మరమ్మతులకు గురైనట్లు ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఫిర్యాదు అందిన వెంటనే వాటిని బాగుచేయిస్తున్నాం. వీలైనంత వేగంగా పునరుద్ధరించే చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో పనులు సకాలంలో చేయలేకపోతున్నాం.

-దుర్యోధన, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, పలాస

కూటమి గెలుపును ఆపలేరు

- 160 స్థానాలు పక్కా
- వైసీపీ పాలనలో రాష్ట్రం నాశనం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు



పట్టుపురం సభలో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

టెక్కలి, మార్చి 20: మరో 53 రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిదే విజయమని, దీన్ని ఎవరూ ఆపలేరని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో కలిసి బుధవారం కోటబొమ్మాళి మండలం పట్టుపురం పంచాయతీ కిష్టంపేట, సోమనాథపురం, మణినాగేశ్వరపురం, కొండపేటల్లో పర్యటించారు. వారికి గ్రామస్థులు హారతులిచ్చి తిలకాలు దిద్ది నీరాజనం పలికారు. ఈ సందర్భంగా పట్టుపురం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. కేంద్రంలో ఎన్డీఏకు 400 సీట్లు, రాష్ట్రంలో కూటమికి 160కు పైగా స్థానాలు పక్కాగా వస్తాయని తెలిపారు. కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు ఓటర్లు కృషి చేయాలని కోరారు. 'టీడీపీ, జనసేన పార్టీ, బీజేపీ పొత్తు పెట్టుకుంటే వైసీపీ కుక్కలు ఇష్టమొచ్చినట్లు మొరుగుతున్నాయి. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని మూడు పార్టీల కూటమి అనివార్యమైంది. ఐదేళ్లలో రాష్ట్రాన్ని జగన్మోహన్‌రెడ్డి సరనాశనం చేశారు. రాష్ట్రం 30 సంవత్సరాలు వెనక్కు వెళ్లింది. తిరిగి రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే కూటమి గెలుపు తప్పనిసరి. వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామస్థాయి నుంచే రౌడీలు, గూండాలు దౌర్జన్యాలు చేస్తూ దాడులకు పాల్పడుతూ హత్యలు చేస్తూ రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చారు. రాష్ట్రంలో ఈ భూమి నాదంటే కొడతారు. ఎవరైనా ఏ సమావేశానికి వెళ్లినా కర్రలతో కొట్టి చంపుతారు. ఈ దుర్మార్గపు ముఖ్యమంత్రితో ఐదుకోట్ల మంది ప్రజానీకం నిద్రలేని రాత్రులు గడిపారు. ఎక్కడ ప్రభుత్వ స్థలం ఉన్నా తాకట్టు పెడుతున్నారు. చివరికి అమరావతి సచివాలయాన్ని కూడా తాకట్టుపెట్టి పన్నెండున్నర లక్షల కోట్లు అప్పుతెచ్చారు. ఈ డబ్బును ఏమిచేశారో జగన్ చెప్పాలి. ఈ ఐదేళ్ల కాలంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు తప్పు చేయకపోయినా కేసులు పెట్టి జైలులో నిర్బంధించి హింసించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు 50 ఏళ్లకు పింఛన్ మంజూరు చేసి నెలకు రూ.4వేలు ఇస్తాం. పింఛన్‌ను మూడు నెలలకు ఒకసారి తీసుకునే సౌలభ్యం కూడా కల్పిస్తాం' అని తెలిపారు.

జగన్ అవినీతి బకాసురుడు: ఎంపీ రామ్మోహన్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అవినీతి బకాసురుడిగా పేరుగాంచారని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆరోపించారు. ఈ సభలో ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కొండలు, భూములు, నదుల్లో ఇసుక తినేశాడని ధ్వజమెత్తారు. పొలాల్లో వేసే సర్వే రాళ్లపై, రైతులకు ఇచ్చే పట్టాదారు పాసుపుస్తకాలపై జగన్ తన ఫొటో వేసుకుంటున్నారు. రేపు ప్రజల ఆస్తిలో కూడా వాటా లాగేస్తారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రన్న కానుక, చంద్రన్న బీమా ఎత్తేశారు. మద్యపాన నిషేధం హామీ అమలు చేయలేదు. నాడు క్వార్టర్ రూ.100 ఉంటే నేడు రూ.200కు పెంచేసి నాన్న బుడ్డీ పథకం పెట్టి ప్రతి కుటుంబాన్ని దోచుకుంటున్నారు. చెత్త మీద, ఇంటి మీద, నీటి మీద ఇలా అన్నింటిపై పన్నులు వేసి ఈ ముఖ్యమంత్రి పన్నులు ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందారు.' అని విమర్శించారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు బోయిన రమేష్, పినకాన అజయ్‌కుమార్, బగాది శేషగిరి, జీరు భీమారావు, నాయకులు కింజరాపు హరివరప్రసాద్, మెండ దాసునాయుడు, వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, కామేశ్వరరావు, నంభాళ్ల శ్రీనివాస్, కర్రి అప్పారావు, నంభాళ్ల రాజశేఖర్, రోణంకి లీలామోహన్, పూజారి శైలజ, అన్నపూర్ణ, వాన లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రచార రథాలు ప్రారంభం..

ఎన్నికల కోసం టీడీపీ ప్రచార రథాలను అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలకు సంబంధించి ఒక్కో మండలంలో రెండేసి ప్రచార రథాలు తిరిగేటట్లు సిద్ధం చేశారు.



అచ్చెన్న, రామ్మోహన్ సమక్షంలో టీడీపీలో చేరిన సోమనాథపురం గ్రామస్థులు

టీడీపీలో చేరిక..

కిష్టుపురం పంచాయతీ సోమనాథపురం, కన్నేవలస పంచాయతీ చుట్టు గుండంకు చెందిన పలువురు యువకులు, పలు కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. సోమనాథపురానికి చెందిన జి.శంకరరావు, బారికివాడు, బి.అప్పలరాజు, దాసరి రుద్రయ్య, రామారావు, మన్మథరావు, శివ, చిన్నవాడు, గోవిందరావు, ఆనంద్, సింహాచలం, అప్పలస్వామి తదితర 25 కుటుంబాలు టీడీపీ తీర్థం తీసుకున్నాయి. వీరందరికీ అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అచ్చెన్నపై నిఘా..

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అచ్చెన్నపై వీడియో సర్వేలైన్స్ బృందం, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం, ఇంటలిజెన్స్ విభాగాలు నిఘా పెట్టాయి. ఎన్ని వాహనాల ద్వారా ప్రచారం చేస్తున్నారు, బ్యానర్లు, జెండాలు ఏ మేరకు వినియోగిస్తున్నారు, గిఫ్టులు ఏమైనా పంపిణీ చేస్తున్నారా?, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తున్నారా? ఇలా పలు అంశాలపై ఆయా విభాగాల అధికారులు ఆరా తీశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ తన వాహనంలో పట్టుపురం వైపు వచ్చారు.

'కోడ్' అమలుపై నిర్లక్ష్యం?



రిమ్స్‌లోని సెంట్రల్ మెడిసిన్ స్టోర్సు భవనం వద్ద శిలాఫలకం ఇలా..



ఆర్‌కేనగర్‌లో..

శ్రీకాకుళం క్రైం, మార్చి 20: సార్వత్రిక ఎన్నికల కోడ్‌ను అధికారులు పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా కేంద్రంలోనే కోడ్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్)లోని ఆక్సిజన్ ప్లాంట్ వద్ద ఫ్లెక్సీపై సీఎం జగన్ బొమ్మ దర్శనమివ్వడంపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చింది. దీనిపై అధికారులు స్పందించి బుధవారం ఆ ఫ్లెక్సీలో సీఎం ఫొటోను మూసేసి చేతులు దులుపేసుకున్నారు. అయితే రిమ్స్‌లోని సెంట్రల్ మెడిసిన్ స్టోర్సు భవనం వద్ద మంత్రుల శిలాఫలకాలను పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే కాంప్లెక్స్ వెనుక ఉన్న ఆర్‌కే నగర్‌లో మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రారంభించిన శిలాఫలకాలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు స్పందించి ఇటువంటి శిలాఫలకాలను కప్పి ఉంచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కోడ్ ఉల్లంఘించిన కాళింగ కార్పొరేషన్ చైర్మన్‌పై కేసు నమోదు

పొందూరు: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి తోలాపి గ్రామంలో ఆత్మీయ సభ పేరుతో రాజకీయ సభను నిర్వహించిన కాళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల రామారావు (లక్ష్మణరావు)పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఈ నెల 17న కాళింగ కార్పొ రేషన్ చైర్మన్‌గా రామారావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆత్మీయ సభ పేరుతో రాజకీయ సభ నిర్వహించారు. ఈ సభలో స్పీకర్ తమ్మినేని సీతారం, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ పాల్గొని రాజకీయ ప్రసంగాలు చేశారు. అయితే, తన అనుమతి లేకుండా సభ నిర్వహించారంటూ పాఠశాల హెచ్ఎం ఎన్నికల అధికారు లకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎన్నికల అధికారి, ఎంపీడీవో సూర్యనారాయణ విచారణ చేపట్టారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్టు తేలడంతో ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాళింగ కార్పొరేషన్ చైర్మన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

కూర్మనాథుని డోలోత్సవానికి వేళాయె

- రేపటి నుంచి ప్రారంభం
- భారీగా తరలిరానున్న భక్తులు



కూర్మనాథుని మూల విరాట్

గార, మార్చి 20: శ్రీకూర్మం దివ్యక్షేత్రంలో ఏటా ఫల్గుణమాసంలో నిర్వహించే డోలోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నాలుగు రోజుల పాటు కూర్మనాథుని డోలోత్సవాలను కన్నులపండుగగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్షేత్రానికి ఎనిమిది దిక్కుల్లో నరదగుండం, సుధాగుండం, చక్రతీర్థం, మాధవగుండం, కౌటిల్యతీర్థం, వక్రతీర్థం, నరసింహపాతాళం, మహోదధి (దక్షిణ సముద్రం) ఉన్నాయి. ఈ అష్టతీర్థాల్లో పవిత్రస్నానాలు చేసి స్వామిని దర్శించుకుంటే ముక్తి లభిస్తుందని భక్తుల నమ్మకం. డోలోత్సవం తొలిరోజు కామదహనోత్సవంతో ప్రారంభమవుతుంది. 22న రాత్రి శ్రీదేవి, భూదేవి, గోవిందరాజుస్వామి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి మేళాతాళాలతో తిరువీధి నిర్వహిస్తారు. అనంతరం గ్రామసమీపంలో కామదహన మండపం వద్ద అశేష భక్తజనుల మధ్య అర్చకస్వాములు కామదహనోత్సవాన్ని నిర్వహిస్తారు. ఎండిన కొబ్బరికొమ్మను నిలబెట్టి దానికి పూజలు చేసిన అనంతరం హోమం నిర్వహించి ఆ కొబ్బరికొమ్మకు నిప్పంటిస్తారు. 23, 24 తేదీల్లో పడియా ఉత్సవాన్ని నిర్వహిస్తారు. భక్తులు సముద్ర స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటారు. 25న పౌర్ణమిరోజున డోలోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవమూర్తులను గ్రామ సమీపంలోని డోలో మండ పానికి తీసుకువెళ్తారు. అక్కడ ఊయలలో ఉంచి పూజలు చేస్తారు. స్వామివారిని ఉత్తరాది ముఖంగా భక్తులు దర్శించుకుంటారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలైన విజయనగర పూసపాటి గజపతుల గోత్రనామాలతో స్వామికి బుక్కా, భర్గుండ పూజలు చేస్తారు. ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు ఒడిశా నుంచి కూడా వేలాదిమంది భక్తులు తరలిరానున్నారు.

అకాల వర్షం

- పలాసలో ఇళ్లలోకి చేరిన మురుగునీరు
- టెక్కలిలో జలమయమైన రోడ్లు
- మొక్కజొన్న, నువ్వు పంటకు నష్టం

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో బుధవారం ఉదయం నుంచి ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పట్టణాల్లోని రోడ్లపై నీరు ప్రవహిం చడంతో పాటు గ్రామాల్లోని పంట పొలాల్లోకి నీరు చేరింది. పలాసలో కురిసిన భారీ వర్షానికి మురుగు కాలువలు నిండిపోయి మురుగునీరు లేబర్‌కాలనీలో ఇళ్ల లోకి ప్రవేశించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ న్నారు. పలాస, టెక్కలి, కంచిలిలో రోడ్లపై నీరు ప్రవహించి వాహనదారులు రాకపోకలకు ఇక్కట్లు పడ్డారు. నందిగాం, పలాస మండలంలో జీడి, నువ్వు పంటలకు ఈ వర్షం కొంత ప్రయోజనకరంగా ఉందని రైతులు పేర్కొనగా హిరమండలంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు నువ్వు పంటలో నీరు చేరి నష్టం వాటిల్లిందని పలువురు బాధితులు వాపోయారు.

-ఆంధ్రజ్యోతి బృందం


టెక్కలి: నౌపడా-మెళియాపుట్టి రోడ్డులో నిలిచిన వర్షపు నీరు


కంచిలి మెయిన్‌రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు


జి.సిగడాం: పెంట-పాగిరి రోడ్డుపై నీటిలో నిరసన తెలుపుతున్నయువకులు


వజ్రపుకొత్తూరు: శీతాపురం పొలాల్లో చేరిన నీరు


ఇచ్ఛాపురం: కొళిగాం ఇటుకుల పరిశ్రమ వద్ద..


పలాస: లేబర్‌కాలనీలో ఇంటి లోకి చేరిన మురుగునీరు

ఎంపీ, శిరీష వాహనాల తనిఖీ


ఎంపీ కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

పలాస/పలాస రూరల్: లక్ష్మీపురం గ్రామం వద్ద జాతీయ రహదారిపై బుధవారం ఎంపీ కింజ రాపు రామ్మోహన్ నాయుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష వాహనాలను ఎన్నికల సిబ్బంది తనిఖీ చేశారు. అయితే ఎటువంటి ఎన్నికల మెటీరియల్ లభ్యం కాకపోవడంతో వారు వెను దిరిగారు. సాధారణ తనిఖీల్లో భాగంగా అభ్యర్థుల కార్లను తనిఖీ చేసినట్లు సిబ్బంది తెలిపారు.

పక్షుల పరిరక్షణకు పాటుపడండి


చిత్రలేఖన పోటీలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాతపట్నం: పక్షులు అంతరించి పోకుండా వాటిని పరిరక్షించుకోవాలని హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్త జీవరాసులను కాపాడడంతోనే పర్యావరణ పరిరక్షణ ముడిపడిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు చిత్రలేఖనం పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయుడు ఎస్వీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దతామరాపల్లి పాఠశాలలో..


పిచ్చుక బొమ్మలు వేసిన చిన్నారులు

నందిగాం: పెద్దతామరాపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం కె.గున్నయ్య పిచ్చుకలు, ఇతర పక్షి జాతుల పరిరక్షణ ఆవశ్య కతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థు లకు పిచ్చుకలపై చిత్ర లేఖనం పోటీ నిర్వహిం చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలక శంకరరావు, కె.తిరుపతిరావు పాల్గొన్నారు.

ఘనంగా ఉమారామలింగేశ్వరుని కల్యాణం


ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

టెక్కలి: టెక్కలిలోని చేరివీధి ఊరచెరువు గట్టుపై ఉన్న ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అర్చకులు వేద మంత్రాల నడుమ కల్యాణంతో పాటు తిరువీధి ఉత్సవాన్ని చేపట్టారు. అలాగే భక్తులకు అన్న ప్రసాద వితరణ, కళాకారులచే భక్తి గీతాలాపన నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

కోదండరామస్వామి పుష్కర బ్రహ్మోత్సవం


పుష్కర బ్రహ్మోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

చింతలబడవంజ(ఎల్.ఎన్.పేట): చింతలబడవంజ గ్రామంలో వెలసిన కోదండ రామస్వామి పుష్కర బ్రహ్మోత్సవాలు బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త అన్నెపు లోహితుడు ఆధ్వర్యంలో పురోహితులు చామర్తి జగన్నాథాచార్యులు పర్య వేక్షణలో విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామస్థులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసా దాలను స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ పేరంటాలమ్మకు ముర్రాటలు


శ్రీలక్ష్మీ పేరంటాలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

జలుమూరు: అబ్బాయిపేటలో కొలువు తీరిన శ్రీలక్ష్మీ పేరంటాలమ్మకు బుధవారం గ్రామ స్థులు ప్రత్యేక పూజలు చేసి ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ 18వ వార్షికోత్సవం సందర్భంగా విశేష పూజలు చేశారు. మంగళ వాయిద్యాలతో మహిళలు కలశాలతో ఆలయానికి చేరుకుని ముర్రాటలు పోసి చల్లదనం చేశారు.

ఘనంగా ముఖలింగేశ్వరుని గ్రామోత్సవం

జలుమూరు: శ్రీముఖలింగంలోని ముఖలింగేశ్వర స్వామి గ్రామోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఫాల్గుణ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను పల్లకిలో వేంచేపు చేసి గ్రామంలో తిరువీధి చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామికి మంగళ హారతులిచ్చి దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోడ్ వర్తించదా..!


కంబకాయి వద్ద అండర్ పాసేజ్ గోడకు ఉన్న పోస్టర్లు

నరసన్నపేట: పట్టణం కంబకాయి జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై అండర్ పాసేజ్ వంతెన గోడపై అధికార పార్టీ నేతల పోస్టర్లను తొలగించలేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇటువంటి పరిస్థితి నెలకొందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇతర పార్టీల నేతల పోస్టర్లు తొలగించి వైసీపీ నేతల పోస్టర్లను తొలగించకపోవడంపై విమర్శలొస్తున్నాయి. ఎన్నికల కోడ్ అమలై నాలుగు రోజులైనా అధికారులు స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తక్షణం వాటిని తొలగించి నిబంధనలను పాటించాలని పలువురు కోరుతున్నారు.

నిబంధనలు తూచ్

గార: ప్రభుత్వ కార్యాలయాలకు, భవనాలకు వేసిన వైసీపీ రంగులు మార్చాలని గతంలో హైకోర్టు ఆదేశాలిచ్చినా క్షేత్ర స్థాయిలో అది అమలు కావడం లేదు. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా.. గారలో ఉన్న రక్షిత నీటి పథకం ఓహెచ్‌ఆర్ (వాటర్ ట్యాంకు)కు ఉన్న వైసీపీ రంగులు మార్చకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల నిబంధనలను అధికారులు పట్టించుకోవడం లేదన్న వాదనలొస్తు న్నాయి. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.


గారలో ఓవర్ హెడ్ ట్యాంకుకు వైసీపీ రంగులు

పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

గార: అరంగిపేట, అనఘాదేవి గ్రామాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మె ల్యే గుండ లక్ష్మీదేవి బుధవారం పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుల్లటి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు కొర్రాయి గోపి, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా

- ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి: ఎస్పీ రాధిక


పాతపట్నం: సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్పీలు రాధిక, శ్వేతకుమారి

కొత్తూరు: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. బుధవారం ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతం మాతల గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. మద్యం, డబ్బు, ఇతర అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పగడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. 24 గంటలూ చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండి అన్ని వాహనాలను తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, కొత్తూరు సీఐ వేణుగోపాలరావు, కొత్తూరు, హిరమండలం ఎస్‌ఐలు ఎం.అహ్మద్, నారా యణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏవోబీ చెక్‌పోస్టును పరిశీలించిన ఎస్పీలు

పాతపట్నం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఆంధ్ర-ఒడిశా సరిహద్దు చెక్‌పోస్టును ఎస్పీ జీఆర్ రాధిక, ఒడిశా రాష్ట్ర గజపతి జిల్లా ఎస్పీ శ్వేతకుమారి బుధవారం పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సరిహద్దు కావడంతో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వీరి వెంట టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, సీఐ నల్లి సాయి ఎస్‌ఐ మహమ్మద్ యాశిన్‌తో పాటు ఒడిశా అధికారులు పాల్గొన్నారు.

గొప్పిలి చెక్ పోస్టును తనిఖీ చేసిన ఏఎస్పీ


చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఏఎస్పీ ప్రేమ్‌కాజల్

మెళియాపుట్టి: గొప్పిలి చెక్‌పోస్టును ఏఎస్పీ జి.ప్రేమ్ కాజల్ బుధవారం తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఒడిశా నుంచి మద్యం, ఇతర సామగ్రి రాకుండా గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాజేష్ పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు వేయండి


పాతపట్నం: సూచనలిస్తున్న ఎంపీడీవో

రావిచెంద్రి(ఎల్.ఎన్.పేట): సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటరు స్వేచ్ఛగా ఓటు వేయాలని ఎంపీడీవో జి.గిరిబాల సూచించారు. బుధవారం రావిచెంద్రి, పూశాచం, చొర్లంగి గ్రామాల్లో పర్యటించి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌పై ప్రజలకు అవగాహన కలిగించారు. పోటీలో ఉన్న అభ్యర్థుల్లో తనకు నచ్చిన వ్యక్తికి ఓటు వేసుకునే అవకాశం ఉందన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లను నియోజకవర్గ ఎన్నికల అధికారి అనుమతి లేకుండా ఏర్పాటు చేయకూడదని పార్టీల కార్యకర్తలకు సూచించారు. ఎన్నికల నిబంధనలను పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పోలీసు కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

నందిగాం: ఓటుహక్కు వినియోగంపై వెలుగు ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో బుధవారం అవగాహన కలిగిం చారు. కామదేనువు, శారదాపురం, కాశీరాజుకాశీపురం, దొడ్ల రామచంద్రాపురం, రౌతుపురం తది తర గ్రామాల్లో వెలుగు సీసీలు, వీవోఏల నేతృత్వంలో సమావేశాలు నిర్వహించి ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ర్యాలీలు చేపట్టారు. కార్యక్రమంలో తిరుమలా దేవి, లీలావతి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



నందిగాం: ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

పాతపట్నం: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని ఎంపీడీవో కె.రామకృష్ణరాజు అన్నారు. గంగువాడ సచివాలయాన్ని బుధవారం సందర్శించారు. గ్రామంలో వివిధ రాజకీయ పార్టీల ప్రచార పోస్టర్లు కనిపించడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణం వాటిని తొలగించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రచారంలో వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది పాల్గొంటే చర్యలు తీసుకుంటామన్నారు. పెద్దలోగిడి, తెంబూరు గ్రామాల సచివాలయాలను సందర్శించి సిబ్బందికి సూచనలిచ్చారు.

నిబంధనలు విధిగా పాటించాలి

జలుమూరు: ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలని ఎన్నికల కోడ్ ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి తిరుపతిరావు అన్నారు. లింగాలవలస, చల్లవానిపేట గ్రామాల వద్ద బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఆధారాలు లేని నగదు, మద్యం, గంజాయి అక్రమంగా తరలిస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి అచ్చెన్న పరామర్శ



నందిగాం: దేవుపురం మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు శిష్టు గున్నయ్య మృతిచెందడంతో ఆ యన కుటుంబ సభ్యులను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం పరామర్శించారు. కొండ తెంబూరులోని మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

చినుకుపడితే నరకమే!

పాతపట్నం: స్థానిక శివశంకర్‌కాలనీ నాల్గో వీధి వద్ద ఏమాత్రం వర్షం కురిసినా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగు కాలువలు సరిగా లేకపోవడంతో మురుగు నీరంతా రోడ్డుపైకి ప్రవహించి రోజుల తరబడి ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. కాలువల నిర్మాణం సరిగా లేకపోవడం, దీర్ఘకాలంగా కాలువల్లోని సిల్ట్ తొలగించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంటోందని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


శివశంకర్ కాలనీ నాల్గోవీధి కూడలి వద్ద పరిస్థితి..

'గొట్టా' డౌన్ స్ట్రీమ్ ఏప్రాన్‌కు నిధుల మంజూరు



హిరమండలం: హిరమండలం వద్ద గొట్టాబ్యారేజీ డౌన్ స్ట్రీమ్ ఏప్రాన్ నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు వంశధార ఎస్ఈ డోల తిరుమల రావు తెలిపారు. ఈనెల 13న 'ఆంధ్ర జ్యోతి'లో 'గొట్టాను గాలికొది లేశారు' శీర్షికతో వచ్చిన కథనానికి ప్రభుత్వం స్పందించింది. బ్యారేజీ దిగువన శిథిలావస్థకు చేరుకున్న జడ్డి స్టోన్ ఏప్రాన్ నిర్మాణానికి రూ.12.81 కోట్లు మంజూరు చేస్తూ ఈనెల 16 ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి తమ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయన్నారు. 2019లో రూ.7 కోట్లతో టెండ ర్ పిలిచి పనులు ప్రారంభించామని, అయితే కాంట్రాక్టర్ పనులు మధ్యలో నిలిపివేసి చేతులె త్తేశారన్నారు. ఆ కాంట్రాక్ట్ రద్దు చేసి డిపాజిట్ సొమ్మును ప్రభు త్వం స్వాధీనం చేసుకుందన్నారు. ఏప్రాన్ మరమ్మతులకు తాజాగా ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపగా అత్యవసర నిధుల కింద రూ.12.81 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఎన్నికల కోడ్ వల్ల పనులు ప్రారంభించ లేమన్నారు. ఏప్రాన్ పనులు అత్యవసరంగా చేయాల్సి ఉండడంతో ఎన్నికల కమిషన్ అనుమతి కోసం లేఖ రాస్తామన్నారు. అనుమతులు వస్తే టెండర్ పిలిచి మరమ్మతులు చేపడతామన్నారు.

నేడు మామిడి అప్పలసూరి వర్ధంతి

నరసన్నపేట: విప్లవ సూరీడు మామిడి అప్పలసూరి 27వ వర్ధంతిని కోమర్తి గ్రామంలోని అమర వీరుల స్థూపం వద్ద గురువారం నిర్వహిస్తున్నట్లు న్యూడెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాండ్ర ప్రకాశ్, ప్రజా సంఘాల నేతలు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రామికులు, రైతు కూలీలు హాజరై నివాళి అర్పించాలని కోరారు.









కొత్తపోలవలస సర్పంచ్ అదృశ్యం

● ఆర్థిక లావాదేవీలే కారణం ● ఆత్మహత్య చేసుకుంటున్నానని లేఖ

● పోలీసులకు అతడి భార్య ఫిర్యాదు



శ్యామకుమార్

నరసన్నపేట: కొత్తపోలవలస సర్పంచ్ వెంకట శ్యామకుమార్ బుధవారం ఉదయం నుంచి కనిపించడం లేదని భార్య ప్రశాంతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అశోక్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కొత్తపోలవలస పంచాయతీ నర్సింగరాయుడుపేటకు చెంది, వైసీపీ సానుభూతి పరుడైన వెంకట శ్యామకుమార్.. తాను ఆర్థికంగా చితికిపోయానని, మానసికంగా బాధపడుతున్నానని, ఈ నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు లేఖ రాసి బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై వెళ్లిపోయారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. అయితే ఇటీవల శ్యామకుమార్ ఒక ఆసామికి ఇవ్వాల్సిన సొమ్మును తక్షణమే చెల్లించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిందని, అలాగే గ్రామస్థులతో పాటు మరికొంతమందికి భారీ మొత్తంలో బాకీలున్నట్టు గ్రామస్థులు చెబుతున్నారు.

ట్రాక్‌పై రాత్రంతా గాయాలతో...

● వృద్ధుడిని ఆసుపత్రికి తరలించిన రైల్వే సిబ్బంది



ట్రాక్‌పై పడివున్న గుర్తుతెలియని వృద్ధుడు

పలాస, మార్చి 20: కాశీబుగ్గ ఎల్‌సీ గేటుకు దూరంగా తీవ్రంగా గాయపడిన ఓ గుర్తుతెలియని వృద్ధుడు (సుమారు 70 ఏళ్ల వయస్సు) రైల్వే ట్రాక్‌పై రాత్రంతా పడి ఉన్నాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి జరగ్గా బుధవారం ఉదయం గుర్తించారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ట్రాక్‌పై అపస్మారక స్థితిలో ఓ వృద్ధుడు ఉన్నాడు. విశాఖ వైపు వెళ్తున్న ట్రాక్‌పై వృద్ధుడు ఉండడంతో అనేక రైళ్లు ఆ మార్గంలో వెళ్లడంతో అతడు చనిపోయి ఉన్నట్టు బుధవారం ఉదయం రైల్వే అధికారులకు సమాచారం వచ్చింది. అయితే వెంటనే రైల్వే పోలీసులు వెళ్లి చూడగా అతని శరీరంలో కదలికలు కనిపించడంతో వెంటనే 108 వాహనానికి సమాచారం అందించారు. 108 సిబ్బందితో పాటు రైల్వే పోలీసులు తులసీరావు, సోమేశ్వరరావు, నవీన్ తదితరులు ట్రాక్‌పై నుంచి అతికష్టమ్మీద రోడ్డుపైకి తీసుకువచ్చి ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో శ్రీకాకుళం జీజీహెచ్‌కు తరలించారు. అయితే అతను రైలు నుంచి ప్రమాద వశాత్తు పడిపోయాడా, లేక ట్రాక్‌పై వెళుతూ ప్రమాదవ శాత్తు రైలు కింద పడిపోయాడా అన్నది తేలాల్సి ఉంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ దర్యాప్తు

జలుమూరు: బావాజీపేట గ్రామానికి చెందిన గొర్లె చిన్నమ్మడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ విజయ్‌కుమార్ బుధవారం దర్యాప్తు చేపట్టారు. అదేగ్రామానికి చెందిన కొత్తకోట వెంకటరమణ కులంపేరుతో దూషించి దాడిచేసి గాయపరిచారని ఆమె ఫిర్యాదు చేయగా ఎస్ఐ మధుసూదనరావు కేసు నమోదు చేశారు. దీనిపై డీఎస్పీ గ్రామాన్ని సందర్శించి తగాదా జరిగిన స్థలాన్ని పరిశీలించారు. తగాదాపై స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నరసన్నపేట సీఐ బి.ప్రసాదరావు, వీఆర్వో అర్జునరావు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం



అరసవల్లి: పార్టీలో చేరినవారితో మాట్లాడుతున్న గొండు శంకర్

అరసవల్లి: వైసీపీ పాలనలో అన్ని రంగాల్లో సర్వనాశమైపోయిన రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి, సంక్షేమ పథంలో నడిపించడం ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ నాయకుడు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం గూనపాలెం టీడీపీ కార్యకర్తలు బుధవారం శంకర్‌ను విశాఖ-ఏ కాలనీలో గల ఆయన కార్యాలయంలో కలుసుకున్నారు. అలాగే 30 మంది శంకర్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో బొల్ల నాగేంద్రయాదవ్, బుర్రి మధు, రాయి కిరణ్, రెడ్డి గిరిజా శంకర్, గొండు శ్యాంసుందర్, ఎండు అమ్మనరావు, ఎండు చిన్నారావు, శిమ్మ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

కలెక్టరేట్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతీ ఒక్క రాజకీయ పార్టీ భాగస్వాములై, సహకరించాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను నిష్పక్షపాతంగా చేపట్టడం జరుగుతోందన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు వివిధ రకాల పర్మిషన్ల కొరకు 'సువిధ' యాప్‌లో ఆన్‌లైన్ ద్వారా ఎలా దరఖాస్తు చేసుకోవాలో కలెక్టర్ వారికి వివరించారు. జిల్లాలో ఎక్కడైనా అధికారులు గానీ, పార్టీల ప్రతినిధులు గానీ ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్టు మీ దృష్టికి వస్తే సి-విజిల్ యాప్ ద్వారా, లేదా టోల్‌ఫ్రీ నెంబరు 1950 లేదా కాల్ సెంటర్ నెంబర్ 18004256625కు కాల్ చేసి తెలియజేస్తే, వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి ఓటర్ల జాబితాలో తొలగింపులు, మార్పులు ఉండవని, వాటికోసం వచ్చే దరఖాస్తులను పరిశీలిస్తామన్నారు. జాబితాలో కొత్తగా పేర్లు చేర్చడానికి, ఒక చోట నుంచి మరో చోటుకు ఓటు బదిలీకి మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. 85 ఏళ్లు దాటిన వారు జిల్లాలో 11,455 మంది, దివ్యాంగ ఓటర్లు 21,486 మంది ఉన్నారని, వీరు ఫారం-12డీ సమర్పించడం ద్వారా ఇంటి నుంచే ఓటు వేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.గణపతిరావు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పీఎంజే బాబు(టీడీపీ), రౌతు శంకరరావు(వైసీపీ) సురేష్ సింగ్ బాబు (బీజేపీ), డి.గోవిందరావు (సీపీఎం), సోమేశ్వరరావు(బీఎస్పీ) తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం: కేసుపురం పంచాయతీ సన్యాసిపుట్టుగ గ్రామంలో కొత్తగా నిర్మించిన కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవం జరిగింది. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే బెందాళం అశోక్ పూజల్లో పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ సాడి సహదేవ్‌రెడ్డి, తదిత రులు పాల్గొన్నారు. అలాగే ఈదుపురంలోని షిర్డీసాయి మందిరం వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు.

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఇచ్ఛాపురం: డబ్బూరివీధి జంక్షన్ దక్షిణ కాళీమాత ఆలయ సమీపంలో నూతనంగా నిర్మించిన పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం వేదపండితులు తేజేశ్వర శర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



టెక్కలి: మోదుగువలసలో సూపర్ సిక్స్‌పై అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీతోనే మహిళా సాధికారత

● మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి



శ్రీకాకుళం రూరల్: పథకాలపై ప్రచారం చేస్తున్న లక్ష్మీదేవి

శ్రీకాకుళం రూరల్: రాష్ట్రంలో మహిళా సాధికారత టీడీపీ-జనసేన-బీజేపీతోనే సాధ్యమని శ్రీకాకుళం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. శిలగాం సింగువలస గ్రామంలో బుధవారం సాయంత్రం సూపర్ సిక్స్ పథకాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై కరపత్రాలను పంచిపెట్టారు. రాష్ట్రంలో వైసీపీ దుష్టపాలనకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించుకుని సువర్ణాంధ్రప్రదేశ్‌ను సాధించుకుందామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కంచు దశరథ్, ఎంపీటీసీ కె.జోగులు, పార్టీ నాయకులు బి.దివాకర్, జోగులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసమే పొత్తు

● ఎంపీ రామ్మోహన్‌నాయుడు



విలేఖరులతో మాట్లాడుతున్న రామ్మోహన్‌నాయుడు

పొందూరు: రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల పొత్తు రాజకీయ పొత్తు కాదని, రాష్ట్రాభివృద్ధి కోసమేనని ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు అన్నారు. మండల కేంద్రంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. మూడు పార్టీల కూటమిని చూసి అధికార పార్టీ భయపడుతోందని, అందుకే రాకీయ పొత్తు అని విమర్శలు చేస్తోందన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో 20 ఏళ్లు వెనుకకు పోయిందని, రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టాలంటే ప్రధాని మోదీ, చంద్రబాబుతోనే సాధ్యమని జనసేన పార్టీ అధినేత గ్రహించే పొత్తులోకి వెళ్లారన్నారు. రాష్ట్రంలో మూడు పార్టీల పొత్తుకు ప్రజల ఆశీస్సులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సాధారణ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి 400 ఎంపీ సీట్లనుచ రాష్ట్రంలో 160 ఎమ్మెల్యే సీట్లను సాధించడం ఖాయమన్నారు. వలంటీర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, లేకుంటే మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. రాష్ట్రంలో పవనాలు మూడు పార్టీల కూటమివైపే వీస్తున్నాయని చెప్పారు. ఎంపీతో పాటు దాసునాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అనకాపల్లి రంగ, నాయకులు బలగ శంకరభాస్కర్, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్



ఇచ్ఛాపురం: పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఇచ్ఛాపురం: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఆంధ్రా-ఒడిశా సరిహద్దు పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అన్నారు. బుధవారం ఇచ్ఛాపురం వచ్చిన కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. అనంతరం చెక్‌పోస్టును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఒడిశా మద్యం, సారా, గంజాయి, డబ్బు అక్రమంగా తరలించే అవకాశం ఉందని, అనుమానం ఉన్న ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆంధ్రా-ఒడిశా గ్రామాలు కలిసి ఉన్న మ్యాప్‌ను పరిశీలించారు. వీటితో పాటు కేదారిపురం రోడ్డులో ఉన్న రైల్వే గేటు వద్ద కూడా గస్తీ ఉంచి వాహనాలను చెక్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేశ్వరరావు రెడ్డి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.సుదర్శన్ దొర, సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు, ఎస్ఐలు సత్యనారాయణ, లక్ష్మణ్ పోలీస్ సిబ్బంది, తహసీల్దార్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

● **కవిటి:** మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ బుధవారం పరిశీలించారు. బొరివంక, పెద్దకర్రివాని పాలెం, కవిటి, ఇద్దివానిపాలెం గ్రామాల్లో పోలింగ్‌ల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. మండల స్థాయి అధికారులంతా సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వహించాలని ఆదేశించారు. తహసీల్దార్ ఎం.లక్ష్మి, ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్డీ శివాజీ పాణిగ్రాహి ఉన్నారు.

● **కంచిలి:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ బుధవారం కంచిలి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల్లో వలంటీర్లు పాల్గొనకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎంవీకేఎస్ రవి, ఎంపీడీవో నీరజ, ఎస్ఐ జి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

● **సోంపేట:** సోంపేట కాలేజ్ వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్స్ వద్ద పటిష్టమైన భద్రత ఉండేలా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. బుధవారం స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర, సీఐ, ఎస్ఐ, తహసీల్దార్, ఎంపీడీవో పాల్గొన్నారు.

నోటి శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో

అరసవల్లి: ప్రతీ ఒక్కరు నోటి పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, తద్వారా పలు అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చని డీఎంహెచ్‌వో బి.మీనాక్షి పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ నోటి దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నోటి శుభ్రతను పట్టించుకోకపోతే నోటి నుంచి దుర్వాసన, పంటి నొప్పి, చిగుళ్ల నుంచి రక్తం ఇతర దంత సమస్యలు సంభవిస్తాయని తెలిపారు. దంత వైద్యులు కుసుమ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఏ విధంగా దంతధావనం చేయాలి, ఎంతసేపు చేయాలి అన్న విషయాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు సీపీ శ్రీదేవి, హెచ్ఎం సంతోష్ వేణు, ఉపాధ్యాయులు, హరనాథం, నిరంజన్, మురళీకృష్ణ, నీలకంఠం, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఏయూ విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల: కేంద్ర యువజన, క్రీడా వ్యవహారాల శాఖ నిర్వహించిన జాతీయ యువ పార్లమెంట్ ఫెస్టివల్-2024లో పాల్గొని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ విద్యార్థిని ప్రతిభ కనబరిచింది. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాల వారీగా ఈ పోటీలను ఆన్‌లైన్‌లో జరిగాయి. వక్తృత్వ పోటీల్లో సుమారు 60 మంది విద్యార్థులు పాల్గొనగా, ఇందులో బీఆర్ఏయూలో ఇంజనీరింగ్ చదువుతున్న బమ్మిడి రంజని ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. మేకింగ్ ఇండియా- గ్లోబల్ లీడర్ అనే అంశంపై మాట్లాడి ప్రతిభ చూపిన రంజనిని వీసీ కేఆర్ రజని బుధవారం అభినందించారు. జిల్లాలోని నందిగాం మండలం ఆనందపురం గ్రామానికి చెందిన విద్యార్థిని రంజని ఈ ఏడాది ఢిల్లీలో నిర్వహించిన రిపబ్లిక్ డే పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొంది.

ఓటు హక్కును వినియోగించుకోండి

కవిటి: ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏపీఎం కె.గోవింద్ అన్నారు. మహిళా సంఘాల సభ్యులతో బుధవారం కవిటిలో ఓటు హక్కుపై మహిళా సంఘాలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

● **ఇచ్ఛాపురం:** రానున్న ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకొనేలా ఓటర్లకు అవగాహన కల్పించాలని ఏపీఎం సనపల ప్రసాద్ అన్నారు. బుధవారం వెలుగు కార్యాలయంలో ఎస్‌హెచ్‌సీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

రిజర్వు స్థలాలను సంరక్షించాలి



రిజర్వు స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అన్సారియా

శ్రీకాకుళం క్రైం: నగరపాలక సంస్థకు చెందిన రిజర్వు స్థలాలను సంరక్షించాలని సంబంధిత అధికారులను కమిషనర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఈ మేరకు బుధవారం నవభారత్ జంక్షన్, పీఎన్ కాలని, చౌదరి సత్యనారాయణ కాలనీ, ముచ్చువానిపేట, తోటపాలెం తదితర ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. పీఎన్ కాలనీలోని గార్బేజ్ స్టేషన్‌లు పరిశీలించారు. పీఎన్ కాలనీలో కొళాయిలకు మోటార్లు బిగించిన వారికి రూ.25 వేలు అపరాధ రుసుం విధించారు.

ఎన్నికలకు అంతా సహకరించాలి

ఇచ్ఛాపురం: అధికారులంతా అప్రమత్తంగా ఉండి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అంతా సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.సుదర్శన్ దొర అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ప్రశాంత వాతావరణంలో పోలింగే లక్ష్యం



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ

శ్రీకాకుళం క్రైం: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పని చేయాలని సీఐ ఎల్ఎస్ నాయుడు అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం నక్క వీధి, మున్సిపల్ హైస్కూల్, మొండేటి వీధి, మంగువారితోట, ఆదిత్య నగర్ కాలనీ, ఖాజీపేట, ఇలిసిపురంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. తనిఖీలు ముమ్మరం చేయాలని, నగదు లావాదేవీలు, మద్యం, సారా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఎస్ఐలను ఆదేశించారు.

నిరంతర పరీక్షలతోనే గ్లకోమాకి అడ్డుకట్ట

ఎచ్చెర్ల: ప్రజలను అంధత్వం వైపు నెట్టేసే గ్లకోమా వ్యాధి దేశంలో రోజు రోజుకు విస్తరిస్తున్నట్టు గీతం వైద్య శాస్త్ర పరిశోధన సంస్థ (విశాఖ)కు చెందిన నేత్ర వైద్య అధ్యాపకురాలు పి.వీణాబెన్ స్వరూప్ అన్నారు. గ్లకోమా నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్సిటీలో నిర్వహించిన అవగాహనలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. గ్లకోమా రావడానికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. బీఆర్ఏయూ వీసీ కేఆర్ రజని మాట్లాడుతూ.. నేత్రాలను పరిరక్షించుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ బిడ్డిక అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత పాల్గొన్నారు. గ్లకోమా క్యూఆర్ కోడ్‌కు సంబంధించి ప్రత్యేక స్టాంప్ పత్రాన్ని ఆవిష్కరించారు.

నేడు జిల్లాలో డీఐజీ పర్యటన

శ్రీకాకుళం క్రైం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలో పోలీసు భద్రత, కేంద్ర బలగాల విధులు, పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు, జాతీయ రహదారిపై చెక్ పోస్టులు, రాష్ట్ర, అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులను, సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను ఆయన పరిశీలించనున్నారు. అలాగే జిల్లా పోలీసు అధికారులతో ఎన్నికల విధి నిర్వాహణలపై సమీక్షించనున్నారు.

షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

లావేరు: బొంతుపేటలో గల షిర్డీ సాయి ఆలయం వార్షికోత్సవం బుధవారం ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ధర్మకర్త వాళ్లె గోవిందనాయుడు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ పూజా కార్యక్రమంలో బొంతుపేట, బోరపేట, వెంకటరావుపేట, సుభద్రాపురం, చిగిరికొత్తపల్లి తదితర గ్రామాల్లోని భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన చేపట్టారు.

అనుమతి తీసుకోవాలి

సరుబుజ్జిలి: ఎన్నికల ప్రచారంలో పాల్గొనే రాజకీయ పార్టీల నేతలు ఆమదాలవలస నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తహసీల్దార్ జె.రమేష్‌బాబు బుధవారం తెలిపారు. ప్రచార సమయంలో వినియోగించే వాహనాలు, లౌడ్‌స్పీకర్లు, కరప త్రాలు పంపిణీ, జెండాలు, తాత్కాలిక పార్టీ కార్యాలయాలు, ర్యాలీలకు సంబంధిత అనుమతులు పొందాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్షతగాత్రులను కాపాడితే ప్రోత్సాహం

శ్రీకాకుళంక్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారు ఎదురుపడినప్పుడు వారిని వీలైనంత త్వరగా ఆస్పత్రికి చేర్చడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇలా చేసినవారికి గుడ్ సమారిటాన్ కేంద్ర పథకం ద్వారా రూ.5వేలు ప్రోత్సాహం అందించనున్నట్టు ట్రాఫిక్ సీఐ అవతారం అన్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బుధవారం ట్రామా అవేర్నెస్(రోడ్డు ప్రమాదాల)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ- జిల్లాలో రోడ్డు ప్రమాదాల వల్ల 2022లో 270, 2023లో 297, 2024 మార్చి 15 నాటికి 57 మంది మరణింగా 1003, 902, 218 మంది గాయపడ్డారని వివరించారు. వీరిలో 25 ఎళ్ల యువకులు అధికంగా మరణించారని, 60 శాతం ప్రమాదాలు టూ వీలర్స్, హెల్మెట్ ధరించకపోవడం వల్లే జరిగాయన్నారు. నగర పరిధిలో హెల్మెట్ ధరించనవసరం లేదని వస్తున్న వార్తలు అవాస్తవమని, ప్రతీ ఒక్కరూ తమ ప్రాణ రక్షణకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు మురళీధర్‌రావు, అన్నెపు శివప్రసాద్, జీహెచ్ సాగరిక, బాల సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

ఇచ్ఛాపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.సుదర్శన్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి విషయంలో 24గంటల పాటు అందుబాటులో ఉంటాయని, ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. తప్పుడు ఫిర్యాదులు, తప్పుడు సమాచారం ఇస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రిన్సిపాల్‌గా ఉదయలక్ష్మి



పొందూరు: పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సీహెచ్ ఉదయలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా పనిచేసిన ఉదయలక్ష్మి ప్రిన్సిపాల్‌గా పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేసిన డి.రాము బదిలీ అయింది.

కొచ్చెర్లలో పోలీసు కవాతు

రణస్థలం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం సాయంత్రం కొచ్చెర్ల గ్రామంలో ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు కార్యక్రమం చేపట్టారు. కొచ్చెర్ల గ్రామం చుట్టూ పోలీసులు కవాతు నిర్వహించారు. పోలీసు కవాతు చూసిన స్థానికులు ఎన్నికల కోసం చర్చించుకున్నారు.

ఇచ్ఛాపురం పట్టణంలో..

ఇచ్ఛాపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముందస్తు అవగాహన కార్యక్రమంలో భాగంగా పోలీసు బృందాలు కవాతు నిర్వహించారు. బుధవారం సీఐ ఇమ్మాన్యుయెల్ రాజు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో పోలీసు బృందాలు పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి కవాతు నిర్వహించారు. బస్టాండ్ జంక్షన్ నుంచి మార్కెట్ మీదుగా దాసన్నపేట జంక్షన్ వరకు తిరిగి పోలీస స్టేషన్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతీ ఒక్కరూ సహకరించాలని, చట్టాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని అన్నారు. పోలీస్ కవాతును మన్‌జీర్ జిలానీ సమూన్ పరిశీలించారు.

కనుగులవానిపేటలో...

శ్రీకాకుళం రూరల్: రూరల్ మండలం కనుగులవానిపేట గ్రామంలో బుధవారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వాసు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో గ్రామంలో ర్యాలీ చేశారు. అనంతరం గ్రామస్థులతో ఎన్నికల నిర్వాహణపై చర్చించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకుందామని ఎటువంటి తగాదాలు లేకుండా ఓటింగ్‌లో పాల్గొనాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్ర బలగాలతోపాటు స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



రణస్థలంలో: పోలీసు కవాతు నిర్వహిస్తున్న దృశ్యం



ఇచ్ఛాపురం పట్టణంలో పోలీసులు..



శ్రీకాకుళం క్రైం: కనుగులవానిపేటలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్